విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారధ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news

ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
25-12-2025
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 01
సంచిక: 113

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# నేనున్నంత కాలం.. నీకు అధికారం కల్లే

తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్, ఆయన కుటుంబానికి అధికారం దక్కనివ్వనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శపథం చేశారు. మంతరిగా, కేంద్రమంత్రిగా, సిఎంగా పదేళ్లు పనిచేసిన కెసిఆర్ నాలుగు మంచి మాటలు చెప్పకుండా తోలు తీస్తానంటూ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. నీలాగా తిట్టుడు మొదలు పెడితే తట్టుకోలేవు కెసిఆర్ అంటూ హెచ్చరికలు చేశారు. నారాయణపేట జిల్లా కోస్గిలో ఏర్పాటు చేసిన సర్పంచ్‌ల సన్మాన సభలో సీఎం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

- రాష్ట్రంలో బిఆర్ఎస్, కెసిఆర్ ఇక గత చరిత్రే
- కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు
- వరుస ఓటములు ఎదురయినా సిగ్గురాలేదా
- నన్నూ..నా కుటుంబాన్ని ఇబ్బంది పెట్టినా పట్టించుకోలే
- కేసులు పెట్టి జైలుకు తోసినా లాభం లేదని మిన్నకున్నా
- ఫామ్‌హౌజ్‌నే జైలుగా మార్చుకుని ఉంటున్నావని గుర్తుంచుకో
- నీలా పాస్‌పోర్టు బ్రోకర్ దందా చేసి పైకి రాలేదు
- సొంత చెల్లిని మెడబట్టి గెంటిన కెటిఆర్ నాపై విమర్శలా
- నీలాంటి వారిని చాలామందిని చూసా..గుర్తుంచుకో
- కిందిస్థాయి నుంచి వచ్చి సిఎంగా అయ్యా
- కొడంగల్ సభలో కెసిఆర్‌పై ఘాటు విమర్శలు చేసిన రేవంత్

**మహబూబ్‌నగర్,ప్రభాత సూర్య :** 'రెండేళ్ల తర్వాత కేసీఆర్ బయటకు వచ్చి తోలు తీస్తానంటున్నారు. కేసీఆర్‌వి సోయిలేని మాటలు.. స్థాయిలేని విమర్శలు. గతంలో నన్ను,




2లో

## సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభవార్త

- గ్రామాల అభివృద్ధికి నడుం బిగించాలని పిలుపు
- గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సూచన
- కేంద్రం నుంచి మార్చిలోగా 3వేల కోట్లు వస్తాయని వెల్లడి
- కొడంగల్‌లో సర్పంచ్‌ల సన్మాన కార్యాక్రమంలో రేవంత్ వెల్లడి

**మహబూబ్‌నగర్, ప్రభాత సూర్య :** గ్రామాల అభివృద్ధికి కొత్త సర్పంచ్‌లు తమవంతుగా కృషి చేయాలని, వారికి ప్రభుత్వం తోడ్పాటుగా ఉంటుందని సిఎం రేంవత్ రెడ్డి అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని

భారత అంతరిక్ష పరిశోధాన సంస్థ ఇస్రో మరో మైలురాయిని చేరింది. శ్రీహరి కోటలో బాహుబలి రాకెట్ ప్రయోగం విజయవంతం అయ్యింది. అమెరికాకు చెందిన భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ బ్లూ బర్డ్ బ్లాక్-2ను ఈ రాకెట్ విజయవంతంగా నింగిలోకి తీసుకెళ్లింది. తొలిసారిగా ఇంతటి భారీ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపింది. కేవలం 15 నిమిషాల్లోనే బ్లూబర్డ్ ప్రయోగం విజయవంతమైంది.



## మరో మైలురాయిని అందుకున్న ఇస్రో

- బాహుబలి రాకెట్ ప్రయోజం విజయవంతం
- అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామన్న ఇస్రో చైర్మన్



## పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

- లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడుల వంచుతాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరిక

**కరీంనగర్,ప్రభాత సూర్య:** గ్రామ పంచాయతీలకు నెలరోజుల్లోగా నిధులు విడుదల చేయాలని..

2లో

## డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరణ

- తదుపరి విచారణ జనవరి 20వ తేదీకి వాయిదా

**హైదరాబాద్, ప్రభాత సూర్య:** రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

## ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

- శిలాజ ఇంధనాల వాడకం కూడా ఓ కారణం
- నేను మూడ్రోజుల్లోనే ఇన్‌ఫెక్షన్ బారిన పడ్డా
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

2లో






## సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

- రేవంత్ రెడ్డి ఊరూరా ప్రచారం చేసినా ఫలితం రాలే
- బిఆర్ఎస్ సర్పంచ్‌ల అభినందనలో హరీష్ రావు

## మేడారం మహాజాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు

- గద్దెలపై కొలువుదీరిన పగిడిద్దరాజు, గోవిందరాజులు
- సంప్రదాయ గిరిజన పద్ధతిలో పూజల నిర్వహణ
- కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క, అధికారులు

**ములుగు,ప్రభాత సూర్య:** మేడారం మహాజాతర కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గద్దెలపై పగిడిద్దరాజు, గోవిందరాజులు కొలువుదీరారు. ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం గోవిందరాజును

2లో



## నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు

- రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతాం
- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజినరీ నేత
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్

**నిజామాబాద్, ప్రభాత సూర్య:** రాష్ట్రంలో అత్యధిక కాంగ్రెస్ సర్పంచులు నిజామాబాద్ జిల్లాలోనే గెలుపొందారని.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పారు

(మొదటి పేజీ తరువాయి)

**మెదక్,ప్రభాత సూర్య:** సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ దెబ్బకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలంటేనే గడగడ వణుకుతున్నడని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన నర్సపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గెలిచిన వారికి శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. రేవంత్‌రెడ్డిని ఏకిపారేశారు. 'సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన వారికి నా పక్షాన, బీఆర్ఎస్ పార్టీ పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు. ఈ గెలుపు మామూలు గెలుపు కాదు, అద్భుతమైన గెలుపు. ఓటమి భయంతో రేవంత్‌రెడ్డి కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఫలితం దక్కలేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేయరు. కానీ ఓడిపోతామనే భయంతో రేవంత్‌రెడ్డి ఊరూరు తిరిగిండు. 'అందిరికీ బతుకమ్మ చీరలు ఇచ్చిన, ఆ చీరలు కట్టుకుని వచ్చి కాంగ్రెపోళ్లకు ఓటేయాలె' చిల్లర మాటలు మాట్లాడిండు. అయినా కూడా కాంగ్రెస్ పార్టీ భంగపడింది. సాధారణంగా పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి 90 శాతం, వీలైతే 100 శాతం విజయాలు దక్కాలి. కానీ కాంగ్రెస్‌కు 64 శాతం ఫలితాలే వచ్చాయి. కాంగ్రెస్ 6 వేల సర్పంచ్ పదవులు గెలిస్తే, బీఆర్ఎస్ 4 వేల సర్పంచ్ పదవులు గెలుచుకుంది' అన్నారు.'బీఆర్ఎస్ హయాంల 32 జిల్లాపరిషత్‌లు మనమే గెలిచినం. 10 డీసీసీబీలు, 10 డీసీఎంఎస్‌లు ఉంటే వంద శాతం మనమే గెలిచినం. సర్పంచ్ ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం మనమే గెలిచినం. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా 35 నుంచి 40 శాతం బీఆర్ఎస్ సర్పంచ్‌లను గెలిపించింద్రు ప్రజలు. కాంగ్రెసోళ్లు పైసలు పంచి, సారా పంచి, గూండాగురి చేసినా గూడా బీఆర్ఎస్ పార్టీ నుంచి 4 వేల మంది సర్పంచ్‌లుగా గెలువడం మామూలు విషయం కాదు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ లేదు సచ్చిపోయింది అంటడు. కానీ నిద్రల గూడా బీఆర్ఎస్ పార్టీ గురించే కలువరిస్తడు. బీఆర్ఎస్ పార్టీ పేరు తీయకుండా, కేసీఆర్ పేరు తీయకుండా ఎప్పుడన్న మాట్లడుతడా రేవంత్‌రెడ్డి..? మల్ల మీదికెల్లి మేకపోతు గాంభీర్యం. ఓసారి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇగ బీఆర్ఎస్ పని అయిపోయింది.

# పంచాయితీలకు వెంటనే నిధులు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. రెండేళ్లుగా రాష్ట్రంలోని పంచాయితీలకు నిధులు ఇవ్వలేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. బుధవారం కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. పంచాయితీలకు ఇచ్చిన నిధులన్నీ కేంద్రానివే అని స్పష్టం చేశారు. పంచాయతీలకు ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం విడుదల చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ రాకముందే.. నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు. ఇటీవల తెలంగాణలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక గ్రామ పంచాయతీలను గెలుచుకుంది. గ్రామ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు.. మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అయితే ఈ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్.. రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదీకాక.. రాష్ట్రవ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సర్కార్ కసరత్తు చేస్తుంది. వీటిని సంక్రాంతి పండగ వెళ్లిన తర్వాత చేపట్టాలని భావిస్తుంది. ఒకవేళ ఈ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే.. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఇది నిధుల విడుదలకు అడ్డంకిగా మారుతోంది. ఈ నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# డీజీపీ శివధర్ రెడ్డి నియామక ఉత్తర్వులు రద్దుకు రాష్ట్ర హైకోర్టు నిరాకరణ

నిరాకరించింది. రెండు వారాల్లోగా డీజీపీల ప్యానెల్ లిస్టును యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ)కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా డీజీపీ ఎంపిక ఉండాలని హైకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ప్యానెల్ లిస్టును యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో తదుపరి విచారణను జనవరి 20వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల తెలంగాణ డీజీపీగా శివధర్ రెడ్డిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నియామకాన్ని హైదరాబాద్‌కు చెందిన సోషల్ వర్కర్ టి. మధన్ గోపాల్ రావు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ నియామక ఉత్తర్వులు 2018 నాటి సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్ లైన్స్‌కు పూర్తి వ్యతిరేకమంటూ పిటిషనర్ వ్యక్తిగతం హాజరై ఈ కేసును హైకోర్టులో వాదించారు. డీజీపీ పదవి విరమణకు కనీసం 3 నెలల ముందుగానే యూపీఎస్సీకి రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ భర్తీ వివరాలను సమర్పించాల్సి ఉందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దాంతో శాశ్వత నియామక ప్రక్రియ ఆగిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై హైకోర్టు పలుమార్లు విచారణ జరిపింది. తాజాగా డీజీపీ నియామక ఉత్తర్వులు రద్దు చేసేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది.

# ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రత

**న్యూఢిల్లీ,ప్రభాత సూర్య:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరిఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు తన శాఖ కూడా ఒక కారణమనే విషయాన్ని అంగీకరిస్తున్నానని అన్నారు. బుధవారంనాడు ఢిల్లీలో మాజీ కేంద్ర సమాచార కమిషనర్ ఉదయ్ మాహూర్‌కర్ రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, భారతదేశం ఏటా రూ.22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందని, ఇది కాలుష్యానికి ఒక కీలక కారణమవు తోందని అన్నారు. 'నేను ఇక్కడ రెండ్రోజులుగా ఉంటున్నాను. దీంతో ఇన్‌ఫెక్షన్ బారినపడ్డాను. ఢిల్లీ తీవ్ర కాలుష్యం గుప్పిట్లో ఉంది. నేను రవాణా శాఖ మంత్రిగా ఉన్నాను. రవాణా వల్లే 40 శాతం కాలుష్యం వస్తోంది. పెద్దఎత్తున శిలాజ ఇంధనం వాడకమే ఇందుకు కారణమవుతోంది. మనం ప్రత్యామ్నాయ పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ వాటిని అందిపుచ్చుకునేందుకు ప్రజలు వెనకాడుతున్నారు' అని గడ్కరి అన్నారు. బయో ఇంధనాల వాడకం ద్వారా స్వయం సమృద్ధి భారత్ దిశగా మనం ముందుకు వెళ్లలేమా అని గడ్కరి ప్రశ్నించారు. తాను 100 శాతం ఇథనాల్‌తో కారును వాడుతున్నానని, ఇది 60 శాతం ఎలక్ట్రిసిటీని జనరేట్ చేస్తోందని, పొల్యూషన్ అనేదే లేదని చెప్పారు. గతంలోనూ నితిన్ గడ్కరి ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకూ పడిపోతుండటంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎప్పుడు వచ్చినా రెండు మూడు రోజులే ఉంటానని, ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని అనుకుంటానని చెప్పారు. నేను ఇక్కడ మూడు రోజులుగా ఉంటున్నాను.

# నేనున్నంత కాలం..నీకు అధికారం కల్లే

(మొదటి పేజీ తరువాయి)

నా కుటుంబాన్ని ఎన్నో రకాలుగా ఇబ్బందులు పెట్టారు. పగ సాధించడం మెదలుపెడితే రాష్ట్రానికి నష్టం జరుగుతుందని వదిలిపెట్టా. నేను ప్రమాణం చేసినప్పుడే కూలబడ్డారు.. ఇంతకంటే పెద్ద శిక్ష ఇంకేం ఉంటుంది. ఫాంహౌస్‌ను కేసీఆర్ బందీఖానాగా మార్చుకుని చుట్టూ పోలీసులున్నారు. చర్లపల్లికైనా, చంచల్‌గూడ జైలుకు పంపినా అదే పరిస్థితి ఉంటుంది కదా. నన్ను గెలకవద్దు.. మర్యాదగా ఉండదని మాట్లాడటం లేదు. నల్లమల నుంచి వచ్చి జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ తర్వాత సీఎం అయ్యా అంటూ ఘాటైన విమర్శలు చేశారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్ఎల్‌బిసి వంటి ప్రాజెక్టులను పండబెట్టిన ఘనుడవని విమర్శించారు. స్థిరాస్తి వ్యాపారం దందా చేస్తున్నానని కేసీఆర్ ఆరోపిస్తున్నారు. ఇదేం పాస్‌పోర్టు బ్రోకర్ వ్యవహారం కాదు. దుబాయ్ పంపుతామని ఎవరినీ మోసం చేయలేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారంతో రాష్ట్రానికి ఆదాయం వస్తుంది. మరో వైపు.. హైదరాబాద్‌లో స్థిరాస్తి వ్యాపారం పడిపోయిందని కేటీఆర్ చెబుతున్నారు. కక్ష సాధింపు రాజకీయాలు చేయం.. ఎవరి పాపాన వారు పోతారని వదిలేశాం. మైకు ముందుకు రావట్లేదు.. దాక్కున్నానని కేటీఆర్ ఆరోపిస్తున్నారు. నువ్వెంత.. నీ స్థాయి ఎంత? తండ్రి పేరు చెప్పుకొని బతుకుతున్నావు. ఏపీలో చదువుకున్న కేటీఆర్‌కు తెలంగాణ గురించి ఏం తెలుసు? మా ఊరికొస్తావా? మీ ఊరికి రావాలా? ఎవరు భయపడుతున్నారో తెలుస్తుంది. గజ్వేల్‌లో లక్షలాది మంది కార్యకర్తలతో నిరసన చేపడితో పాతాళానికి వెళ్లారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 సీట్లు అయితే.. 2/3 వంతు మెజార్టీతో 80కి పైగా సీట్లతో మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం. ఒకవేళ 153 సీట్లయితే.. 100కి పైగా స్థానాల్లో విజయం సాధించి రెండో సారి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు రాసి పెట్టుకోండి.. ఇదే నా సవాల్. నేను రాజకీయం చేసినంత కాలం కాలకూట విషం లాంటి కేసీఆర్ కుటుంబాన్ని అధికారంలోకి రానివ్వను.. ఇదే నా శపథం. కొడంగల్ బిడ్డగా ఈ గడ్డపై నుంచి శపథం చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉన్నంత కాలం... వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి అధికారమనేది కల. భారత రాష్ట్ర సమితి, కేసీఆర్ చరిత్ర ఖతమే. మీ పార్టీకి, మీకు భవిష్యత్తు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్ గతమే.. తెలంగాణ భవిష్యత్తు కాంగ్రెస్. గత చరిత్రతో ఒరిగేదేమీ లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాం. పార్లమెంట్ ఎన్నికల్లో గుండు సున్నా ఇచ్చాం. కంటోన్మెంట్‌లో బండకేసి కొట్టాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బోరబండలో బండ కింద పాతిపెట్టినం. 12,726 పంచాయతీల్లో 8,335 మంది సర్పంచ్‌లను గెలిపించుకున్నాం. ఇన్ని సార్లు ఓడించినా.. ఇంకా నాదే పైచేయి అంటారా? 2029 అసెంబ్లీ ఎన్నికల్లో తేల్చుకుందాం రండి. ఇప్పటికైనా కేసీఆర్ వయసును గౌరవిస్తాం. ఈనెల 29 నుంచి అసెంబ్లీ సమావేశాలు జరగబోతున్నాయి. మీరు చెప్పిన అన్ని అంశాలపై చర్చిద్దాం రండి. అసెంబ్లీలో చర్చించకుండా ఫాంహౌస్‌లో నిద్రపోయి.. ఖాళీగా ఉన్నప్పుడు పార్టీ ఆఫీసుకు వచ్చి ప్రెస్‌మీట్‌లు పెట్టడం కాదు.

# మేడారం మహాజాతరకు ముమ్మరంగా ఏర్పాట్లు

బుధవారం ఉదయం 6 గంటలకు, పగిడిద్దరాజును 9.45 గంటలకు పూజారులు ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జాతర కార్యనిర్వహణాధికారి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తుల ను గద్దెల ప్రాంగణంలోకి రానివ్వకుండా భద్రత ఏర్పాట్లు చేపట్టారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు పూజారులు కుటుంబాలతోపాటు హాజరై పూజా కార్యక్రమాల ను విజయవంతంగా నిర్వహించారు. మేడారం జాతర వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరుగనుంది. దీనికి తెలంగాణతోపాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాలనుంచి కోటి మందికిపైగా భక్తులు తరలి వస్తారని అంచనా. ఈ సారిగా నూతనంగా నిర్మించిన గద్దెలపై సమ్మక్క, సారలమ్మతోపాటు పగిడిద్ద రాజు, గోవిందరాజులను కొలువుదీర్చుతున్నారు. జాతర ప్రాంగణాన్ని చారిత్రక కట్టడాల మాదిరిగా పటిష్ఠంగా ఉండేలా రాతితో పునర్నిర్మిస్తున్నారు. 46 పిల్లర్లతో 271 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ప్రాకారం ఉండనుంది. దాని మధ్య 40 అడుగుల వెడల్పుతో మూడు, 30 అడుగుల వెడల్పుతో ఐదు స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు. గద్దెల ప్రాంగణానికి ఎదుట 50 అడుగుల వెడల్పు ప్రధాన స్వాగత తోరణం ఉంటుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలను సమ్మక్క-సారలమ్మ గద్దెలు ఉండే వరుసలోకి మార్చారు. ఈ ఏర్పాటు ద్వారా భక్తులంతా ఒక వరుసలో దర్శనానికి వెళ్లేందుకు వీలు కలుగనుంది. వృత్తాకారంలో ఉండే గద్దెల చుట్టూ 8 స్తంభాలు ఉంటాయి. వాటి మధ్యలో వెదురు బొంగులతో డెకరేషన్ చేస్తారు.



# మరో మైలురాయిని అందుకున్న ఇస్రో

**తిరుపతి,ప్రభాత సూర్య:** అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో కలిసి ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించింది. ప్రపంచంలో ఎక్కడి నుంచైనా 4.జి, 5జి సేవలను బ్లూ బార్డ్ బ్లాక్-2 అందించనుంది. ఎల్‌వీఎం 3 రాకెట్ సిరీస్‌లో ఇది 9వ ప్రయోగం. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ.. బాహుబలి ప్రయోగం విజయవంతమైందన్నారు. ఎల్‌వీఎంప్రయోగాల్లో సంపూర్ణ విజయాలు సాధిస్తున్నా మని తెలిపారు. అతి తక్కువ సమయంలో రాకెట్ రూపొందించి విజయవంతం చేశామన్నారు. అమెరికన్ కస్టమర్ కోసం ప్రయోగం చేపట్టామని చెప్పారు. ప్రపంచంలో అత్యుత్తమ ప్రయోగాల్లో ఇది ఒకటన్నారు. 34 దేశాలకు ఇస్రో సేవలందిస్తోందని అన్నారు. గగన్‌యాన్ కోసం ఈ ప్రయోగం మరింత ఆత్మవిశ్వాసం కలిగిస్తోందని తెలిపారు. ఇస్రోపై అమెరికా పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టామని ఇస్రో చైర్మన్ తెలిపారు. ఈ ప్రయోగం ఇస్రోకి చారిత్రాత్మకమైన విజయమన్నారు. వాణిజ్య ప్రయోగాలలో మరోసారి సత్తా చాటామని తెలిపారు. అత్యంత కీలకమైన ఈ ప్రయోగం 52 రోజుల్లోనే సిద్ధం చేసి ప్రయోగం చేపట్టామని చెప్పారు. మన శాస్త్రవేత్తల సమిష్టి విజయం.. ఎల్‌వీఎం 3 - ఎం 6 రాకెట్ ప్రయోగం అని చెప్పుకొచ్చారు. ఈ ప్రయోగ విజయం తమకు అత్యంత ధైర్యాన్ని కల్పించిందన్నారు. ఎల్‌వీఎం ప్రయోగాలలో ఈ ప్రయోగం మూడవ వాణిజ్య ప్రయోగమని వెల్లడించారు. ఎల్‌వీఎం రాకెట్లనే చంద్రయాన్ 4, 5కు ఉపయోగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మానవ రహిత ప్రయోగాలని చేపట్టబోతున్నామని ప్రకటించారు. వాణిజ్య ప్రయోగ ఒప్పందాలు పూర్తయిన వెంటనే వరస వాణిజ్య ప్రయోగాలని చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో నావిగేషన్ ప్రయోగాలు, అంతరిక్షంలో స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఇస్రో చైర్మన్ నారాయణన్ పేర్కొన్నారు.

# నిజామాబాద్‌లో అత్యధిక సర్పంచ్‌ల గెలుపు



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే జీవోలు పారదర్శకంగా ఉంటాయన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క జీవోను కూడా బహిర్గతం చేయలేదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక విజన్ ఉన్న నాయకుడని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్‌లో రూ.1.70 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులకు ఒప్పందం కుదరడం ఇందుకు ఉదాహరణ అని అన్నారు. ప్రజా ప్రభుత్వం పాలనలో పదేళ్ల విధ్వంసం నుంచి వికాసం దిశగా ముందుకు వెళ్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అనవసరంగా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేసీఆర్ నోరు జారి మాట్లాడితే తమ ప్రతాపం చూపిస్తామని మందలించారు. ఆయనలా దిగజారి తాము మాట్లాడమని చెప్పుకొచ్చారు. ప్రజలే కేసీఆర్ అండ్ కోకు బుద్ధి చెబుతారని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలకు మంచి చేస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విషం కక్కుతున్నారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక్క రూపాయి కూడా తాము దుర్వినియోగం చేయట్లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు అందించేందుకు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన నీరు అందించాలంటే విద్యుత్తు ఎంతో అవసరమని వివరించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ప్రజలు ఆశీర్వదించారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఫామ్‌హౌస్‌లో కూర్చున్న కేసీఆర్ బయటకు వచ్చి విమర్శిస్తున్నారని ఫైర్ అయ్యారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష నేత నేడు మాయమాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చే దమ్ముందా అని సవాల్ విసిరారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తాము సత్తా చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం రైతు రుణమాఫీ, రైతు భరోసా, బీమా పథకం అమలు చేస్తున్నామని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# సర్పంచ్‌లకు సీఎం రేవంత్ శుభవార్త

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నియోజకవర్గం పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. సర్పంచ్‌లకు శుభవార్త చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లకు నేరుగా నిధులు అందిస్తామని చెప్పారు. పెద్ద గ్రామాలకు రూ. 10 లక్షలు, చిన్న గ్రామాలకు రూ. 5 లక్షలు చొప్పున ఇస్తామన్నారు. సర్పంచ్‌లకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు ఇస్తామని సీఎం తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సంబంధం లేకుండా నిధులు ఇస్తామని తెలిపారు. అలాగే గ్రామాల్లో అర్హులందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తాని సీఎం ప్రకటించారు. కేంద్రం నుంచి 3వేల కోట్లు రావాల్సి ఉందని, మార్చిలోగా వాటిని తెచ్చే బాధ్యత తనదని, వాటిని నేరుగా గ్రామాలకు అందచేస్తామని అన్నారు. ఈ నిధులతో గ్రామాల్లో పనులు మొదలు పెట్టాలన్నారు. మీ సహకారం వల్లే నేను ఇంతటివాడిని అయ్యాను. 2009 నుంచి నన్ను మీ భుజాలపై మోశారు. కొడంగల్‌ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతా. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుంది. గ్రామాల్లో వివక్ష లేకుండా పరిపాలన సాగాలి. పార్టీలు.. పంతాలకు పోకుండా కలిసికట్టుగా పనిచేయాలి. గ్రామాల అభివృద్ధికి పాటుపడేలా సర్పంచ్‌లు ఉండాలి. ప్రజలకు ఉన్నతమైన, నాణ్యమైన సేవలు అందించాలి. పార్టీలకు అతీతంగా గ్రామాలు అభివృద్ధి కావాలని నూతన సర్పంచ్‌లకు సీఎం రేవంత్ సూచించారు. నూతన సంవత్సరంలో గ్రామాలకు ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పంచాయతీలకు యథావిధిగా వచ్చే నిధులు కాకుండా చిన్న గ్రామాలకు రూ.5లక్షలు, పెద్ద గ్రామాలకు రూ.10లక్షలు చొప్పున ముఖ్యమంత్రి నిధి నుంచి ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టు కునేందుకు గ్రామాల్లో సదుపాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సర్పంచ్‌లకు సూచించారు.

గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అభివృద్ధి నిధులు ఉపయోగించాలన్నారు.కొడంగల్ నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ప్రతి గ్రామం, తండాకు రోడ్లు పూర్తి చేస్తాం. గుడి, బడి, తాగునీరు, పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తాం. నిరుద్యోగుల కోసం ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేస్తాం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు.. గ్రామాల్లో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రజా సేవ చేయాలి. దేశ పునాదులు గ్రామాల్లో ఉన్నాయని గాంధీజీ చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. పేదలకు పథకాలు చేరినప్పుడే నిజమైన పాలన అందుబాటులోకి వస్తుంది. కొడంగల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టిన నాయకులను అభినందిస్తున్నా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి మా

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి, లింగస్వామి





**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 24( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాసంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంని సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి . ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు విషయంపై డాక్టర్ సిబ్బందిని ఆరోగ్య కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకుంది. ఎంతోమంది మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వైద్యం కోసం వస్తున్న తరుణంలో ఇలాంటి సమస్య లేకుండా చూసి నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. మంచినీటి సౌకర్యము, నీటి సరఫరా సక్రమంగా లేక పోవటం. మీటింగ్ హాల్ లేకపోవడం ఫర్నిచర్ కొరత ఉండటం మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉండటం వల్ల అన్ని గదులను పరిశీలించి పైన ఉన్న వాటర్ ట్యాంకులను పరిశీలన చేసి ట్యాంక్ లోకి నీళ్లను ఎక్కించి వైద్యులకు, ప్రజలకు మరుగుదొడ్ల సౌకర్యం అందుబాటులో తీసుకురావడానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి వైద్యురాలు కు సిబ్బందికి హామీ ఇవ్వడం జరిగింది. మండల ప్రాంతంలో వివిధ గ్రామాల నుంచి తండాల నుంచి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్యము కల్పించి తేలుకాటు కుక్కకాటు పాము కాటు నివారణకు ఇంజక్షన్లు అందుబాటులో ఉంచే విధంగా వైద్యులు నిరంతరం ప్రజలకు సేవలు అందించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు మందు గుల బాలకృష్ణ, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కొండ నవీన్ గౌడ్, వార్డు మెంబర్ సూరపల్లి వెంకటేశం, పట్నం బాలకృష్ణ, బల్గూరి శివ, కాంగ్రెస్ నాయకులు గునిగంటి రాజు గౌడ్, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేశం, ఎండి యూసఫ్ ఖాన్, ఈసం శివకుమార్, విడం సాయి కిషోర్,ప్రెస్ రిపోర్టర్ సింగం కృష్ణ, సాధక్ తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్

## ఉద్యమ' కళా' కారులు తరలిరావాలి

### టియు జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండమల్ల శ్రీనివాస్



**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 24( ప్రభాత సూర్య):** తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ (టియుజెఏసి) ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల గౌరవం - తెలంగాణ ఆత్మగౌరవ నినాదంతో హైదరాబాద్ బషీర్ బాగ్ లో ఈనెల 28న నిర్వహిస్తున్న ఉద్యమ కళాకారుల ధూం ధాం బహిరంగ సభ కరపత్రాన్ని సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో టియు జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండుమల్ల శ్రీనివాస్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగాల తెలంగాణలో అమరుల త్యాగానికి గౌరవం దక్కలేదని స్వరాష్ట్రం కోసం అన్ని వదులుకొని ఉద్యమించిన ఉద్యమకారులకు ఉద్యోగం,ఉపాధి లేక రోడ్డున పడ్డ పరిస్థితిని చూస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వంలో ఉద్యమకారులకు, కళాకారులకు అన్యాయం జరిగిందని పోరాడుతున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు మద్దతుగా నిలిచి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యమకారులకు కల్పించే అవకాశాలను కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో సైతం పెట్టడం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ఉద్యమకారులకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు కలిసిన ఉద్యమకారులకు, కళాకారులకు ఇచ్చిన హామీలపై అతి,గతి లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఉద్యమకారుల గౌరవాన్ని తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టాలన్నారు. ఆర్ గ్యారంటీలో భాగంగా 250 గజాల ప్లాటు ప్రకటించారు నెలకు గౌరవ వేతనమన్నారు,గుర్తింపు కార్డులు ఉద్యోగమన్నారు. ఉద్యమకారుల, కళాకారుల సమస్యలను విస్మరించి, అవమానపరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో గద్దె దింపుడు ఖాయమన్నారు. ఈనెల 28న హైదరాబాద్ వేదికగా ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేస్తామని తెలిపారు. కావున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు, కళాకారులు పెద్ద ఎత్తున నెల 28న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న బషీర్ బాగ్ తెలంగాణ బహిరంగ సభ కు తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ, కళాకారులకు మద్దతుగా గ్రామ ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి,కుమ్మరి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపన అధ్యక్షులు చిలువేరు అంజయ్య,అంబేద్కర్ సంఘ అధ్యక్షులు కట్ట గాలిబ్ రోషన్,ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షులు వలిగొండ యాదయ్య,పుల్లమోని బిక్షపతి,కట్ట భౌరేష్,వలిగొండ శ్రీనివాసులు,గుండమల్ల లింగస్వామి,మందుగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బోయ లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ చిలకరాజు చందన రాజు

**సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 24( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల సర్వేల్ గ్రామంలోని మర్రిగూడెం ఎస్సీ కాలనీలో బోయ లచ్చయ్య మృతి చెందాడు. వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సాయంగా అందజేసిన గ్రామసర్పంచ్ చిలకరాజు చందన రాజు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు సుక్క స్వామి, దేవాలయ చైర్మన్ సుర్వి యాదయ్య గౌడ్, మాజీ దేవాలయ కమిటీ చైర్మన్ గుత్త శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాజా అంజయ్య, చెర్ల మహేష్, కట్టెల మహేష్, సుక్క నర్సింహ్మా, కట్టెల లింగస్వామి, పంది లింగస్వామి, వడ్డేపల్లి గణేష్, కొలను మల్లేష్, కట్టెల రామస్వామి, వడ్డేపల్లి రాజు ,పంది రాకేష్, కట్టెల ప్రకాష్, పంది రాకేష్ తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా.....

## ఎల్లకొండ ప్రమీల సాయిలు నస్తీపూర్ సర్పంచ్



ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్24:సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ సర్పంచిగా ఎల్లకొండ ప్రమీల సాయిలు ఎన్నికైన అనంతరం ఆమె గ్రామంలో కలియతిరుతూ ప్రజలతో మమేకమై గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయి, ఎలాంటి అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది అని ప్రజలతో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రమీల విలేకరులతో మాట్లాడుతూ తన మీద నమ్మకంతో తనను సర్పంచిగా గెలిపించినందుకు గ్రామ ప్రజలకు, విద్యావంతులకు, ఉద్యోగస్తులకు, యువకులకు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా అన్నారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం నుండి వచ్చే నిధులతో పాటు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సహకారంతో గ్రామానికి అవసరమైన నిధులు తీసుకొచ్చి గ్రామాన్ని అన్నివిధాల అభివృద్ధి చేస్తా అన్నారు.

# ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ ప్రపంచానికి గొప్ప పండుగ...

- మన మతంతో పాటు ఇతర మతాలను గౌరవిద్దాం...
- క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు...
- ప్రముఖ సంఘ సేవకులు గాలిపెల్లి కుమార్..



**కరీంనగర్, డిసెంబర్ 24(ప్రభాత సూర్య):** క్రిస్టమస్ పండుగ సందర్భముగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ముందస్తుగా క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మెగా ఔట్ స్టాండింగ్ బ్లడ్ డోనర్ గాలిపెల్లి కుమార్. ఈ సందర్భంగా సమాజ సేవకులు గాలిపెల్లి కుమార్ మాట్లాడుతూ...క్రిస్మస్ పండుగ శాంతి, ప్రేమ, సోదరభావం వంటి విలువలను బోధిస్తుందని అన్నారు. మత సామరస్యం, ఐక్యతతో సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పండుగను అందరూ కలిసి జరుపుకోవడం మన రాష్ట్ర ప్రత్యేకత అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఒకే రోజు జరుపుకునే పండుగ క్రిస్టమస్ పండుగ అని తెలిపారు.

# గ్రీన్ గ్రోవ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు





చౌటుప్పల్ డిసెంబర్ 24. ప్రభాత సూర్య : చౌటుప్పల పట్టణం కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థినీ విద్యా ర్థులు క్రీస్తు జన్మవృత్తాంతాన్ని నాటక రూపంలో కళ్ళకు కట్టినట్లుగా ప్రదర్శించి ఏసుక్రీస్తు శాంతి సందేశం సారాంశాన్ని తెలియపరిచారు. చిన్నారులు దేవతల వేషధారణలో ఆకట్టుకున్నారు. పశు వుల కాపరులు, ఏసుక్రీస్తు, మరియమాత, ఆనాటి యూదుల రాజుల వేషధారణలు చూపలను ఆకర్షించాయి. చిన్నారి విద్యార్థినులు శాంతా క్లాజ్ రూపంలో వచ్చి తోటి విద్యా ర్థులకు బహుమతులు అందజేశాడు. ఈ సందర్భంగా పాఠశాల చైర్పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి చిన్నారులకు క్రిస్మస్ శు భాకాంక్షలు తెలియజేసారు. పాఠశాల డైరెక్టర్ ఎస్ లక్ష్మి మాట్లాడుతూ ఏసుక్రీస్తు జన్మదిన్నాని పురస్కరించుకొని చేసుకొనే ఈ పండుగ సందర్భంగా క్రీస్తు ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవని భారతదేశం అన్ని మతాలను ఆదరిస్తుందని తెలియ చేసారు. అన్ని మతాల సారము కూడా భగవంతుని చేరుకోవడానికి మార్గాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొని అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోజ్ బడ్స్ లో క్రిస్టమస్ వేడుకలు



చౌటుప్పల్.డిసెంబర్ 24. ప్రభాత సూర్య : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని రోజ్ బడ్స్ పాఠశాలలో బుధవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ప్రధానోపాధ్యాయురాలు బేగం జానీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శాంతాక్లాజ్, మేరీమాత వేషధారణలో పలువురిని అలరింపజేశారు. విద్యార్థుల నృత్యాలు, గానాలు, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపల్ బేగంజాని క్రిస్మస్ గొప్పతనాన్ని వివరించి విద్యార్థులకు చాక్లెట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎంపిజే ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ

## ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్

**ఖమ్మం ( సూర్య ప్రతినిధి ):** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) కార్యాలయంలో పేదలకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఎంపీజే ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు చేయడం చాలా పుణ్య కార్యక్రమం అని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ అన్నారు. పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఎంపీజే సంస్థ చాలా మంచి కార్యక్రమలు చేయడం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలని కోరినారు. మరియు మైనారిటీ గురుకుల పాఠశాల పాఠశాల మరియు కళాశాలలో 2026-27 సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల గురించి మరియు ఇక్కడ అందించే వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసీం, కోశాధికారి హాకీం, వైస్ ప్రెసిడెంట్ రజాబ్‌అలీ, సెక్రటరీ సతీష్ సంస్థ సభ్యులు రఫీ, గఫర్,హుస్సేన్ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.






# క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

## హైదరాబాద్ ఏ.జీ.వో కే వెంకట్రావు, ఆర్.సి.ఓ గౌతమ్ కుమార్ రెడ్డి

## మలక్పేట్ అండ్ కార్వాన్ ఎంజేపీటీ ప్రిన్సిపల్ టి శ్వేత

**చౌటుప్పల్.డిసెంబర్ 24. ప్రభాత సూర్య :** క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మలక్పేట్ అండ్ కార్వాన్ పాఠశాల ప్రిన్సిపాల్ టి శ్వేత తెలిపారు.మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో తుర్కపల్లి లోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించినటువంటి రాష్ట్ర స్థాయి అండర్-14,17,19 క్రీడల్లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ విద్యార్థులు అండర్ 14 విభాగం లో ఖో ఖో ప్రథమ బహుమతి పొందారు.ఈ జట్టులో కార్వాన్ మలక్ పేట్ చెందిన విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ప్రిన్సిపాల్ టి శ్వేత తెలిపారు. అండర్-14 విభాగం లో ఉమేష్ 100 మీటర్స్ లో రాష్ట్ర ద్వితీయ స్థానం, అండర్ 17 విభాగం లో టి. అరుణ్ 1500 మీటర్స్ లో స్టేట్ రెండో స్థానం, 800 మీటర్స్ లో మూడో స్థానాలు పొందినట్లు తెలిపారు. విద్యార్థులను హైదరాబాద్ ఏ.జీ.వో కే. వెంకట్ రావు, హైదరాబాద్ ఆర్.సి.ఓ గౌతమ్ కుమార్ రెడ్డి, మలక్పేట, కార్వాన్ పాఠశాల ప్రిన్సిపల్ టి. శ్వేత అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ... క్రీడాకోటలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు. అంతేకాక ఉన్నత చదువుల కోసం క్రీడా సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ వి. హరి కుమార్, బి డబ్ల్యు ఎండీ అజార్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్పి హేమంత్ కుమార్, ఎం.సతీష్ లు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# మినీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి



**కూకట్ పల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజక వర్గం, కుకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని ప్రజ్ఞా స్కూల్ లో కరస్పాండెంట్ అశోక్ ప్రీతం ఆధ్వర్యంలో మునికృష్ణ మినీ క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి వీరితో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థిని, విద్యార్థులందరికీ మినీ క్రిస్మస్ వేడుకలు తెలియజేస్తూ ప్రతి ఒక్కరూ ఆ దేవుని ఆశీర్వాదంతో విద్యారంగంలో ముందుకు వెళుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో పాపిరెడ్డి నగర్ సీనియర్ నాయకులు ఏసిరెడ్డి భూపాల్ రెడ్డి, మాయ రాజయ్య, ములుగు కిరణ్, మోజస్, గంగుల రాజిరెడ్డి, మాయ బాల నరసయ్య, రవీందర్ రెడ్డి, సత్యప్రసాద్, వెంకట్రావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అంతా ఆగమే..


## రైతులకు రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ అందడం లేదు

## కెసిఆర్ 10 సంవత్సరాల పాలనలో ప్రజలు ఆనందంగా జీవించారు

## రాష్ట్రంలో ఎరువుల కోసం రైతులు గంటల తరబడి లైన్లో వేచి చూశారు

## సీఎం అసెంబ్లీలో మాట్లాడడం కాకుండా ప్రజల వద్దకు వచ్చి చూడలి సమస్యలు కనబడతాయి

## మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 24:కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనలో ఏది చూసినా అంతా ఆగం,ఆగంగానే ఉందని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు.బుధవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని సాయి కృష్ణ గార్డెన్ లో ఏర్పాటు చేసిన బి ఆర్ ఎస్ తరపున గెలిచిన సర్పంచుల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి హరీష్ రావు,సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీ 90 శాతం గెలవాల్సింది.కానీ సర్పంచి ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలికి బల్పం కట్టుకొని తిరిగినా 6000 మంది సర్పంచులు మాత్రమే గెలిచారని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిద్రలో కూడా బి ఆర్ ఎస్ పార్టీని తలచుకుంటున్నారన్నారు.దమ్ము ధైర్యం ఉంటే వెంటనే ఎంపిటిసి జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.ఎవరైతే ఇబ్బందులు పెడుతున్నారో వారి పేర్లను కచ్చితంగా రాసుకోవాలని రెండు సంవత్సరాలు అయితే బిఆర్ఎస్ ప్రభుత్వం కచ్చితంగా వస్తుందని,వారికి మిత్తితో సహా చెల్లిద్దామని కార్యకర్తలకు బరోసా ఇచ్చారు.అంతకు ముందు రెడ్డిపల్లి సబ్స్టేషన్ వద్ద రైతులు ధర్నా చేస్తూ ఉంటే రైతులు తమకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో తాము రెడ్డిపల్లి సబ్స్టేషన్ వద్దకు వెళ్లామని, బోరు బావులకు సరైన విద్యుత్ ప్రభుత్వం అందించడం లేదని రైతులు తమతో విన్నవించుకున్నారని ఆయన తెలిపారు. వారి బాధను గమనించిన నేను, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి సబ్స్టేషన్ లోకి వెళ్లి విద్యుత్ సరఫరా అయ్యే రికార్డులను పరిశీలించగ.24 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి కేవలం 12 గంటలనుండి 14 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు.నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండి అని సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. ప్రతిపక్షాల మీద బురదజల్లడం కాకుండా రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, రైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టేందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెట్టడం లేదని అన్నారు. రాష్ట్రంలో పరిపాలిస్తున్న ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వమని ఆయన పేర్కొన్నారు. బిఆర్ఎస్ పాలనలో ఎరువుల కోసం రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు కొన్నారని తెలిపారు. కానీ నేటి కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం రైతులు కిలోమీటర్ల మేర లైన్లు కట్టారని రైతుల ఉసురుతగిలి కాంగ్రెస్ ప్రభుత్వం నాశనమవుతుందని ఆయన శాపనార్థాలు పెట్టారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు 24 గంటలు విద్యుత్తు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి,సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,బి ఆర్ ఎస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఉమ్మణ్ణగారి దేవేందర్ రెడ్డి,మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్,నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్,సీనియర్ నాయకులు మన్సూర్,గోపి,సత్యం గౌడ్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# మొక్కులు తీర్చుకోవడానికి గణేష్ గడ్డ గణపతి ఆలయం వరకు పాద యాత్ర..

**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 24 :** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ సర్పంచిగా బేగరీ శ్రీహరి గెలుపొందిన సందర్భంగా గుండ్ల మాచునూర్ నుండి గణేష్ గడ్డ గణపతి ఆలయం వరకు సర్పంచి శ్రీహరితో పాటు పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాద యాత్ర గా వెళ్ళి మొక్కులు తీర్చుకున్నారు. గణేష్ గడ్డ వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సర్పంచి శ్రీహరి మాట్లాడుతూ గుండ్ల మాచునూర్ గ్రామప్రజలు తనమీద నమ్మకంతో తనను సర్పంచిగా గెలిపించినం దుకు గ్రామ ప్రజలకు, విద్యావంతులకు, ఉద్యోగస్తు లకు, యువకు లకు, హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా అన్నారు.నిరుద్యోగ యువతి యువకులకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కృషి చేస్తాన న్నారు .గ్రామంలో వృద్ధులు,వికలాంగులకు ఎవరికైతే పెన్షన్లు రావో వారిని గుర్తించి వారికి పెన్షన్లు ఇప్పించే విధంగా చూస్తా అన్నారు.అదేవిధంగా గ్రామంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజ్, వీధి దీపాలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు.ఈకార్యక్రమంలో గునుకుంట్ల శంకర్ ఉప సర్పంచి,అంక పల్లి శ్రీశైలం,అంక పల్లి శ్రీకాంత్,గొల్ల శివకుమార్,మన్నే అశోక్,చెంచు శ్రీశైలం,మన్నే వీరేశం,అలుముల జంగయ్య, వడ్డే రమేష్,బాబు,వెంకటేశం,మొండి శేఖర్,బద్రప్ప తదితరులు ఉన్నారు.

# శివాలయం ముందు ఉన్న చికెన్ సెంటర్‌ను వెంటనే తొలగించాలి

## జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన బిజెపి నాయకులు బాలు యాదవ్

**కూకట్ పల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సూర్య) :** దీనబంధు కాలనీలో గల శివాలయం ముందు ఉన్న చికెన్ సెంటర్ తో వచ్చే భక్తులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే చికెన్ షాప్ ను తీసివేయాలని కూకట్ పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు బాలు యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్ దినబందు కాలనీ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో గల శివాలయం ముందు ఏర్పాటుచేసిన చికెన్ సెంటర్ తో భక్తులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని, స్థానిక భక్తులు చికెన్ సెంటర్ ను ఆ ప్రదేశం నుండి తొలగించాలని పదేపదే అభ్యర్థించినప్పటికీ ఏ పార్టీ నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.ఈ విషయం తెలుసుకున్న భక్తులు కూకట్ పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు బాలు యాదవ్‌కు ఫోన్‌లో సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బిజెపి నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని, జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ఎస్సీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు బండ కుమార్, జిఎస్ శ్రీకాంత్ యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు రాజిరెడ్డి, రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ చారి, డివిజన్ ఉపాధ్యక్షురాలు కవిత, రాష్ట్ర నాయకుడు సాయి కుమార్, డివిజన్ కార్యదర్శి రజిని, మాజీ అధ్యక్షుడు నర్సింగ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, యాదగిరి, సునీల్, సుభాష్, శంకర్, మహేందర్, శ్రీకాంత్, సునీల్ కుమార్, కరణ్ కుమార్, రమేష్, వెంకట్, శ్రీశైలం, సుశీల, తదితరులు పాల్గొన్నారు.







# బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

## తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రశాంతనగర్ మేనేజర్ సాయల లీలావతి

### పాపిరెడ్డి కాలనీలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు






**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ బీమా పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ప్రశాంతనగర్ శాఖ మేనేజర్ సాయల లీలావతి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో గల జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద బుధవారం గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో 'ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు' నిర్వహించారు.

- ఈ సందర్భంగా మేనేజర్ లీలావతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాను కలిగి ఉండాలని, ముఖ్యంగా 'ప్రధానమంత్రి జన్ ధన్' ఖాతాలు లేని వారు వెంటనే కొత్త ఖాతాలను తెరవాలని సూచించారు. బ్యాంక్ ద్వారా అందుతున్న సామాజిక భద్రతా పథకాలైన ఎమ్ ఎస్ బీ వై(జీవన జ్యోతి బీమా), పీ ఎమ్ ఎస్ బీ వై (సురక్ష బీమా) మరియు అటల్ పెన్షన్ యోజన (ఏ పీ వై) వంటి పథకాల ప్రాముఖ్యతను ఆమె వివరించారు.
- సదస్సులోని ముఖ్యాంశాలు:
- (కే వై సీ )అప్‌డేట్: బ్యాంక్ ఖాతాదారులు క్రమం తప్పకుండా తమ కేవైసీ (కే వై సీ )వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని, లేనిపక్షంలో లావాదేవీలకు ఆటంకం కలుగుతుందని తెలిపారు.
- డీ.ఫ్ ఖాతాలు: పదేళ్ల పాటు లావాదేవీలు జరపని ఖాతాలు డీ.ఫ్. కు బదిలీ అవుతాయని, అటువంటి ఖాతాదారులు వెంటనే బ్యాంకును సంప్రదించి తమ సొమ్మును క్లెయిమ్ చేసుకోవాలని కోరారు.
- రుణాల చెల్లింపు: పొదుపు సంఘాల మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.
- గోల్డ్ లోన్స్: బ్యాంకులో అతి తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై రుణాలు అందిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.
- పాల్గొన్న ప్రముఖులు:
- ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మేనేజర్ కె. శ్రీనివాసరావు, ఫీల్డ్ ఆఫీసర్ ప్రియా భాంధవి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇ. నాగ మల్లేశ్వరి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు జి. శ్రీకాంత్, ఆర్. రామ, ఆర్.పి. దేవి తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి వి. సత్యం కృష్ణ కళాజాత బృందం ప్రదర్శించిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సదస్సులో బ్యాంక్ సిబ్బంది మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు...




# మియాపూర్‌లో "క్రియేటివ్ డిజిటల్స్" ఫ్లెక్స్ స్టూడియో ప్రారంభం..

**శేరిలింగంపల్లి ప్రభాత సూర్య :** మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన "క్రియేటివ్ డిజిటల్స్" ఫ్లెక్స్ స్టుడియోను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, గ్రేటర్ హైదరాబాద్ స్టాండింగ్ కమిటీ సభ్యులు వి.జగదీశ్వర్ గౌడ్ మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్టుడియో నిర్వాహకులు రవి కుమార్ గౌడ్, హరి కృష్ణ లకు నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఇలాంటి డిజిటల్ ఫ్లెక్స్ స్టుడియోలు స్థానిక ఉపాధి అవకాశాలను పెంపొందించడమే కాకుండా ప్రాంత అభివృద్ధికి తోడ్పడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీరేందర్ గౌడ్, మన్నేపల్లి సాంబశివ రావు, ఓం ప్రకాష్ గౌడ్, యలమంచి ఉదయ్ కిరణ్, బండారు మోహన్ ముదిరాజ్, రాచమల్ల కృష్ణ పటేల్, రామచందర్ గౌడ్, కావూరి ప్రసాద్, కట్ల శేఖర్ రెడ్డి, శ్రీనివాస్ ముదిరాజ్, మహేందర్, పల్లె మురళి, ఆసిఫ్, రవీందర్ రెడ్డి, శిరీష సత్తూర్, సునీల్, గిరి, పట్వారి శశిధర్, తిరుపతి, సత్య రెడ్డి, కృష్ణ గౌడ్, నరేందర్, బాలకృష్ణ, గిరి బాబు, రవీందర్ ముదిరాజ్, మన్నే విజయ్ ముదిరాజ్, శివ, మస్తాన్ రెడ్డి, గురువులు, వంశీ, రత్నాచారి, వినోద్, గోపీ, వాసు, నాని తదితరులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అదేవిధంగా, మియాపూర్ జనప్రియలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమానికి సురేష్ స్వామి మరియు వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు యలమంచి ఉదయ్ కిరణ్ హాజరై స్వామివారి దివ్య ఆశీర్వాదాలు పొందారు. భక్తజనుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తి శ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వంశీ, రత్నాచారి, వినోద్, కామినేని వాసు, గోపీ తదితరులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# ఇకపై సినిమా టిక్కెట్ ధరల హేతుబద్ధీకరణ

**బడ్జెట్ పేరుతో ఎడాపెడా పెంచకుండా చర్యలు**

**ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్**

అమరావతి: ప్రతిసారి సినిమా బ్జడెట్ ప్రకారం టికెట్ రేట్లు పెంచుతున్నామని, ఇకపై ఇందుకోసం ఓ నూతన విధానాన్ని రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం సచివాలయంలో సినిమా టికెట్ల హేతుబద్ధీకరణపై కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా అనేక అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. ఇప్పటి వరకూ పాత జీవో, సినిమా బడ్జెట్ ప్రకారం సినిమా టికెట్ రేట్లు పెంచుతున్నాం. ఇక నుంచి అలా కాకుండా ఓ విధానాన్ని రూపొందించాలని నిర్ణయించాం. అన్నింటికీ కేటగిరీ ప్రకారం సమానంగా టికెట్లు రేట్లు పెంచే విధానాన్ని పరిశీలిస్తున్నాం అని అన్నారు.. సినిమాలకు టికెట్ ధరను ఎంత నిర్ణయించాలనే విషయమై కమిటీ చర్చిస్తోంది. నిర్మాతలు, డిస్టిబ్యూటర్లు, ఎగ్జిబ్యూటర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయం తీసుకుంటాం. పాన్ ఇండియా సినిమా వల్ల నిర్మాతలకు బడ్జెట్ విపరీతంగా పెరుగుతోంది. నిర్మాతలకు ప్రభుత్వం మద్దతు నిచ్చేలా కమిటీ నిర్ణయం తీసుకుంటుంది. అదే సమయంలో సామాన్యులకూ భారం కాకుండా, సినీ పరిశ్రమకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా తెలుగు సినీ దర్శకుడు తేజ మాట్లాడుతూ.. సినిమా థియేటర్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. థియేటర్‌లో టికెట్ ధర కంటే పాప్‌కార్న్ ధర ఎక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలి కోరినట్లు వివరించారు. ఓటీటీ పైరసీ వల్ల సినిమా పరిశ్రమ నష్టపోతోందన్న తేజ.. సినిమా ఇండస్ట్రీ వైపు నుంచి తమ అభిప్రాయాన్ని కమిటీలో చెప్పినట్లు పేర్కొన్నారు.

# ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ వినతిపత్రం



**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 24 :** సంపంగి ఫామ్ ల్యాండ్ రియల్ ఎస్టేట్ కార్యక్రమానికి విద్యార్థులను తీసుకెళ్లిన ఎంఈఓ నాగారం శ్రీనివాస్ పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ డిమాండ్ చేశారు. సిర్గాపూర్ మండలంలోని సంపంగి ఫామ్ ల్యాండ్ రియల్ ఎస్టేట్ కార్యక్రమానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లిన ఎంఈఓ పైన చర్యలు తీసుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ కు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో ఉన్న సిర్గాపూర్ మండల కేంద్రంలోని సంపంగి ఫార్మ్ ల్యాండ్ రియల్ ఎస్టేట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిర్గాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను పై అధికారుల అనుమతి లేకుండా ఎంఈఓ స్వయంగా తీసుకెళ్లడం అనేది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కడమే అని ఆయన మండిపడ్డారు. ఒకవైపు జిల్లా అధికారులే చలి తీవ్రతరం వల్ల ఎవరు కూడా బయటకు రావద్దని హెచ్చరిస్తూ ఉన్నప్పటికీ సింగపూర్ ఎంఈఓ మాత్రం విద్యార్థులను దాదాపు రాత్రి 9నుడి10 గంటల వరకు ఎముకలు కొరికే చలిలో ఉంచిన పరిస్థితి నెలకొందని అన్నారు. కావున ప్రభుత్వ అనుమతి లేకుండా సంపంగి ఫామ్ అండ్ రియల్ ఎస్టేట్ కార్యక్రమానికి విద్యార్థులను తీసుకుపోయిన ఎంఈఓ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, జిల్లా నాయకులు లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు బోధనలు శాంతికి సహనానికి చిహ్నాం


**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**




**కూకట్ పల్లి, డిసెంబర్ 24 (ప్రభాత సూర్య) :** ఏసు బోధనలు శాంతికి సహనానికి చిహ్నాలని, యావత్ ప్రపంచ మానవాళి ఆచరించదగ్గవని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. కెపిహెచ్బి కాలనీ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మూసాపేట జనతా నగర్ లోని న్యూ అపోలిస్టిక్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి కెపిహెచ్బి బస్ స్టాప్ లో నిర్వహించిన 16వ క్రిస్మస్ సంబరాలకు ముఖ్య అతిథులుగా ఆయన తో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, శేరి సతీష్ రెడ్డి, కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ శంకర్ గౌడ్, గ్రంథాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ల అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్, కృష్ణ రాజ్ పుత్, పాస్టర్ జర్జ్ హెర్బట్, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే సంజీవ్ రావు, మేకల మైఖేల్, యేసు రాజు, గొట్టిముక్కల వెంకట్, పొన్నం రజిత, యూత్ అధ్యక్షులు సలీం, డేవిడ్, అబ్బాస్, సంజయ్, నారాయణ, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, క్రిస్టియన్ సోదర, సోదరీమణులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గట్టుప్పల మండలంలోని క్రిస్మస్ వేడుకలు

**గట్టుప్పల్ ప్రభాత సూర్య డిసెంబర్24:** గట్టుపల్ మండలంలోని చర్చి పాస్టర్ లక్ష్మయ్య పాస్టర్ల కమిటీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు ఈ వేడుకలలో గట్టుప్పల్ ఎమ్మార్వో కె రాములు పాల్గొని క్రిస్మస్ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేశారు సన్మాన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు నామని జగన్నాధం, రావుల స్వప్న రమేష్, సింగం వెంకటేశం,పంకేర్ల ప్రభాకర్, డిప్యూటీ తహశీల్దార్ సుకన్య చర్చి ఫాదర్స్.తదిపరులు పాల్గొన్నారు



# సాయిబాబా నగర్‌లో దాతృత్వాన్ని చాటుతున్న మణికంఠ సేవ సమితి నిర్వాహకులు, గురు స్వామి పి.సంతోష్ గౌడ్

**మాలధారులకు నిత్యన్నదానం**

**ప్రతిరోజూ 500 నుంచి 600 మందికి భిక్ష**



**గండిపేట్ సూర్య ప్రతినిధి:** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్ లో అయ్యప్ప స్వాములకు నిత్యం అన్నదానం చేస్తూ మణికంఠ సేవ సమితి నిర్వాహకులు, గురు స్వామి పి.సంతోష్ గౌడ్ దాతృత్వాన్ని చాటుతున్నారు. ఏకంగా 500 మందికి పైగా అన్నదానం చేస్తూ తన మానవత్వాన్ని చాటుతున్నారు. నియమ నిష్టలతో చేసే అయ్యప్ప దీక్ష.. మనిషి ప్రవర్తనలో మార్పు తీసుకువస్తుందనే సంకల్పంతో ఆయన నడుచుకుంటున్నారు. పేదలకు నిరంతరం అన్నదానం చేస్తూ మానవత్వాన్ని చాటుతున్నారు. ప్రతి రోజు 500 నుంచి 600 మందికి అన్నదానం చేస్తూ అన్నదాన ప్రభువుగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కాలం 41 రోజుల పాటు దీక్షలో ఉన్న భక్తుడు దీక్ష తర్వాత కూడా దురాలోచనలు వదిలి.. సన్మార్గంలో నడిచేలా చేస్తుంది. అందుకే పరమ పవిత్రమైన అయ్యప్ప దీక్ష తీసుకునే భక్తుడినే దేవుడిగా భావిస్తుంటారని వివరించారు. దీక్షలో ఉన్నవారు రోజుకోసారి మధ్యాహ్నం మాత్రమే భిక్ష(భోజనం) చేస్తారు. అందుకే మాలధారులకు భిక్ష పెట్టడానికి చాలా మంది తహతహలాడుతుంటారని వివరించారు. స్వాములను ఇంటికి పిలిచి భిక్ష పెడితే సాక్షాత్తూ అయ్యప్ప స్వామి ఇంటికి వచ్చి బోచిన్ చినట్లుగా భావిస్తారు అని తెలిపారు. సమాజంలో ప్రతి మనిషికి తన వంతుగా అన్నదానం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతిరోజు 500 నుంచి 600 మందికి అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు డి.రాజు, చెన్నమ్మ, లింగం స్వామి, వేణు గౌడ్ పి.మదన్ గౌడ్, పి రాజు, నాగనాథ్ మల్లికార్జున్ దేవేందర్, హరీష్, నీలా శంకర్ స్వాములు సురేష్, విజయ్, లక్కీ, ప్రవీణ్ కుమార్, గౌతమ్, సి.రాజు, శిరందాసు నరేందర్, ప్రవీణ్ కుమార్, సాయికిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు బస్తీలు, కాలనీలలో పర్యటన

**లక్ష్మీగూడ సింధూర కాలనీలో పర్యటించిన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు అక్కెం రాఘవేందర్‌యాదవ్**



**గండిపేట సూర్య ప్రతినిది:** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు బస్తీలలో విస్తృతంగా పర్యటిస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు అక్కెం రాఘవేందర్‌యాదవ్ అన్నారు. బుధవారం లక్ష్మీగూడ గ్రామంలోని సింధూర్ కాలనీలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సమస్యలపై విన్నవించిన పట్టించుకునే నాధుడే లేడని మొరపెట్టుకుంటున్నారన్నారు. హౌసింగ్ బోర్డును ఆనుకోని ఉన్న సింధూర్ కాలనీకి కలుపుకోని రోడ్డు వేయాలని, హౌసింగ్ బోర్డు సింధూర కాలనీ మధ్య ఉన్న స్ట్రీట్‌లైట్స్ వెలగడం లేదని వాటికి వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. ఓపెన్ మురికి కాలు వల్ల చిన్న పిల్లలు అందులో పడిపోవడం, రాత్రివేళల్లో పలు వాహనాలు మురికి కాలువను గుర్తించలేక అందులో పడిపోతున్నాయన్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మైసిరెడ్డి, రవీందర్‌యాదవ్, క్రిష్ణముదిరాజ్, భరత్, నాగరాజు, జనార్ధన్‌రెడ్డి, బసవరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో చలి కొరికేస్తోంది

**రాత్రిపూట గణనీయంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు**


హైదరాబాద్,డిసెంబర్24(ఆర్ఎన్ఎ):తెలుగు రాష్ట్రాలను చలి పులి భయపెడుతోంది. ఎముకలు కొరికే చలితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. వైరల్ రోగాలు పెచ్చు మీరి విలయతాండవం చేస్తున్నాయి. జలుబు, దగ్గు, జ్వరాలతో జనం అల్లాడిపోతున్నారు. రాత్రి పూట పరిస్థితి దారుణంగా తయారు అవుతోంది. ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 3 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతున్నాయి. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. మరో రెండు, మూడు రోజులు అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వెల్లడించింది. తెలంగాణలోని అదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ నెల 26వ తేదీ వరకు పలు జిల్లాల్లో 5 నుంచి 10 డిగ్రీల సెల్సియస్ మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని తెలిపింది. గత కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. 8 నుంచి 13 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. పటాన్ చెరులో 8.4, రాజేంద్ర నగర్‌లో 9.5, హయత్ నగర్‌లో 11.6, బేగంపేటలో 12.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి మొదలైతే.. మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు కూడా చలి తగ్గటం లేదు. ఆంధ్రప్రదేశ్‌లోనూ చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మరీ ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అరకు, పాడేరు, చింతపల్లిలో 5 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం పూట మంచు భారీగా కురుస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి విపరీతంగా ఉన్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులతోపాటు శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత ఈ డిసెంబర్ నెలాఖరు వరకు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



# సజ్జాపూర్ ఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ విచారణ

**ఈనెల 30న సివిల్ రైట్స్ డే నిర్వహించాలి : కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.**

**సామాజిక సమానత్వం కోసం కమిషన్ కట్టుదిట్టమైన చర్యలు**





**ప్రభాత సూర్య సంగారెడ్డి ప్రతినిధి డిసెంబర్ 24:** కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఎస్సీ కుటుంబంపై దాడి ఘటనపై తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు బుధవారం గ్రామాన్ని సందర్శించి సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు.సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి రాములు ఇంటి షెడ్డు కూల్చివేసిన ఘటనపై బాధిత కుటుంబాన్ని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ ఘటనను పూర్తిగా అగ్రవర్ణాల దాడిగానే భావిస్తున్నామని కమిషన్ చైర్మన్ పేర్కొన్నారు.బాధితులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ ఘటనపై ఇప్పటికే ఆరుగురిపై కేసులు నమోదు అయ్యాయని పోలీసు అధికారులు తమకు తెలిపారని అన్నారు.బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని,చట్టప్రకారం తప్పనిసరిగా శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను, జిల్లా యంత్రాంగాన్ని కమిషన్ ఆదేశించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలో శాంతి భద్రతలు కట్టుదిట్టం చేయాలనిఅధికారులకు ఆయన సూచించారు.ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని, సామాజిక సమానత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.గ్రామాలలో నివసించే ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి, శాంతియుత వాతావరణంలో జీవించాలని కమిషన్ చైర్మన్ కోరారు.

ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఈనెల 30వ తేదీన సజ్జాపూర్ గ్రామంలో సివిల్ రైట్స్ డేను అధికారికంగా నిర్వహించాలని జిల్లాయంత్రాంగాన్ని ఆదేశించారు. సివిల్ హక్కుల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సామాజిక సమానత్వం, న్యాయ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెరగాలని తెలిపారు.అంతకుముందు కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యుడు రాంబాబు, కోహిర్ మండల కేంద్రంలోని సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర, బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. వసతి గృహాల పరిసర ప్రాంతాలను పరిశీలించి, భద్రత దృష్ట్యా కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందుతున్నదీ లేనిది వివరంగా ఆరా తీశారు. మెనూ ప్రకారమే భోజనం అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చదువుపై దృష్టి సారించి, పదో తరగతిలో జిల్లాకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందించారు.విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం జరగకూడదన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు సమకూర్చాలని అధికారులకు సూచించారు.అనంతరం కోహిర్ మండలంలోని శ్రీ సిద్ధి వినాయక ఆలయాన్ని కమిషన్ చైర్మన్, సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యుడు రాంబాబుకు అధికారిక లాంఛనాలతో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ.సమాజంలో సమానత్వం, న్యాయం, సామరస్యాన్ని కాపాడటమే ఎస్సీ, ఎస్టీ కమిషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు కమిషన్ ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ ,ఇంచార్జ్ డిపిఓ జానకిరెడ్డి,సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాస్, రెవెన్యూ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, షెడ్యూల్ కులాల సంఘం నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.





# అపూర్వం పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**ఘనంగా శివరాంపల్లి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం**



**గండిపేట సూర్య ప్రతినిధి:** స్నేహం ఎన్నటికీ వాడిపోని జ్ఞాపకం%ౌ% కాలం గడిచినా మరింత బలపడే బంధమని శివరాంపల్లి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1996%-%97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిరూపించారు. రంగారెడ్డి జిల్లా శాతంరాయ్ సమీపంలోని ఎల్.వి.ఎన్ గ్రీన్ అక్రెస్ ఫామ్ హౌస్‌లో నిర్వహించిన వారి ఆత్మీయ సమ్మేళనం అత్యంత వైభవంగా, ఆహ్లాదకరంగా సాగింది. దాదాపు రెండు దశాబ్దాల విరామం తర్వాత ఒకే వేదికపై కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేస్తూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో పొందిన క్రమశిక్షణ, విలువలు, గురువుల శిక్షణే తమ జీవితాలకు బలమైన పునాదిగా నిలిచాయని తెలిపారు. అదే తమను నేడు సమాజంలో వివిధ ఉన్నత స్థానాల్లో స్థిరపడేలా చేసిందని పేర్కొంటూ, తమను తీర్చిదిద్దిన గురువుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. అలాగే, స్నేహం అనేది అవసరాల కోసం పుట్టేది కాదని, అది మనసులను కలిపే పవిత్రమైన బంధమని అభిప్రాయపడ్డారు. ఎన్నేళ్లు గడిచినా తమ మధ్య ఆత్మీయత ఏమాత్రం తగ్గలేదని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమ్మేళనం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, తమ పాఠశాల అభివృద్ధి, పేద విద్యార్థుల చదువులకు సహాయం అందించాలనే సామాజిక బాధ్యతను స్వీకరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. చివరగా, ఈ కార్యక్రమం స్నేహానికి మరియు గురుభక్తికి ప్రతీకగా నిలిచిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 1996%-%97 బ్యాచ్‌కు చెందిన అధిక సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొని సమ్మేళనాన్ని విజయవంతం చేశారు.

# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భర్త హత్య

**వీరన్న హత్య కేసులో అసలుగుట్టు రట్టు**

**మహబూబాబాద్:** జిల్లాలో కేసముద్రం మండలం బోడమంచ్యా తండాలో వీరన్న అనే వ్యక్తి దారుణ హత్యలో అసలు దోషి భార్యే అని తేలింది. ఆమె హత్య చేసినట్లు గుర్తించారు. వీరన్న హత్యకు గురవడం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ హత్యలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చాయి. ప్రియుడితో కలిసి భార్య విజయే భర్తను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. భర్తను హత్య చేసి ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు యత్నించారు. అయితే మృతుడి పేరుపై ముందే రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ చేయించారు భార్య విజయ, ఆమె ప్రియుడు ఆర్ఎంపి డాక్టర్ భరత్. ఈ కారణంగానే భర్తను దారుణంగా హత్య చేసినట్లు విచారణలో పోలీసులు తేల్చారు. మరోవైపు వీరన్న హత్యతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మృతుడి బంధువులు గ్రామంలో ఆందోళనకు దిగారు. వీరన్న హత్యకు కారకుడైన ఆర్ఎంపీ వైద్యుడు భరత్‌కు చెందిన రేకుల షెడ్డును ధ్వంసం చేశారు. అంతేకాకుండా ఓ బైక్‌ను కూడా మృతుడి బంధువులు దహనం చేశారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు గ్రామంలోకి చేరుకుని వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తున్న పరిస్థితి. తమకు న్యాయం కావాలంటూ వీరన్న బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

## నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు

### పోలీస్ కమిషనర్ సిపి సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్ డిసెంబర్ 24:** నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ సిపి సజ్జనార్ తెలిపారు. నేటి నుంచి హైదరాబాద్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..డిసెంబరు 31 రాత్రి హైదరాబాద్ లోని 100 ప్రాంతాల్లోని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరుగుతాయని, తనిఖీల్లో పట్టుబడితే వాహనాలు సీజ్, రూ.10 వేలు జరిమానా ఉంటుందని సజ్జనార్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడితే 6 నెలల జైలు శిక్ష విధించబడుతుందని, తనిఖీల కోసం 7 ప్లాటూన్ల అదనపు బలగాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. పబ్ లు, త్రీస్టార్, ఆపై హోటళ్లలో అర్ధరాత్రి ఒంటిగంట వరకే అనుమతని.. మాదకద్రవ్యాలు, అశ్లీల నృత్యాలకు యజమానులదే బాధ్యతని సూచించారు. రద్దీ ప్రాంతాలు, పార్టీ వెన్యూలు, జంక్షన్లో మఫ్టీలో 15 షీ టీమ్స్ ఏర్పాటు చేశామని సిపి సజ్జనార్ పేర్కొన్నారు.

## జవహర్ నగర్ డంపింగ్ యార్డును పరిశీలించిన ఎంపి ఈటల

**మేడ్చల్:** మేడ్చల్ జిల్లా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను ఎంపీ ఈటల రాజేందర్ పరిశీలించారు. ఈటల మాట్లాడుతూ హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని దాదాపు రెండు కోట్ల మంది జనాభా చెత్తను మొత్తం జవహర్ నగర్ లో వేసి లక్షలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. రాంకీ సంస్థ కోర్టులకు తప్పుడు సమాచారం ఇస్తూ తప్పు త్రోవ పట్టిస్తుందని దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ప్రభుత్వం గనుక స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## హుస్నాబాద్ నియోజకవర్గం సమస్యలపై మంత్రి పొన్నం సమీక్ష

హుస్నాబాద్: విద్యా,వైద్య వ్యవసాయ, విద్యుత్ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత సమస్యలు, యాసంగి పంటల విధానం, యూరియా సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలు,పాఠశాల మౌలిక వసతులు,మండలాల్లో మెడికల్ క్యాంపులు గ్రామాల్లో ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్, మెడికల్ ఆఫీసర్లు,ఏఈలు, ఎంఏఓలు, ఎంఈవో లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తీగుల్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



**సిద్దిపేట:** జగదేవ్ పూర్ మండలంలోనీ తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న మేజర్, మైనర్ రిపేర్లను పరిశీలించారు. వాటర్ కనెక్షన్, టాయిలెట్స్ లో ట్యాప్ లీకేజీలు చెక్ చేసుకోవాలని రిపేర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా పని చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. పిఎచ్ సి లోపల ఎల్లపుడు శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ ఓపి రిజిస్టర్ వెరిఫై చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని మెడికల్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఆదేశించారు. ప్రాంగణం బయట చెత్త చెదారం పిచ్చి మొక్కలు తొలగించాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించారు.

## కాబోయే ప్రధాని ప్రియాంక గాంధి !...

**న్యూఢిల్లీ డిసెంబర్ 24:** వరుస ఓటములతో రాహుల్ గాంధీ పై కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయిందని ఇప్పటికే బీజేపీ ఆరోపిస్తోంది కాగా, మంగళవారం రాబర్ట్ వాద్రా తన భార్య కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఎప్పటికైనా ప్రధాని అవుతుందన్న విశ్వాసం వ్యక్తం చేయడంతో తాజా చర్చకు తెరలేచింది. ఇందిరా గాంధీ మాదిరిగా పోలికలు ఉన్న ప్రియాంకను ప్రధానిగా చూడాలని చాలామంది కోరుకుంటున్నారని, ఇది కాలమే నిర్ణయించాలని రాబర్ట్ వాద్రా అన్నారు. ప్రియాంక తన నాన్నమ్మ మాదిరిగా బలమైన ప్రధానిగా నిరూపించుకుంటారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా రాబర్ట్ వాద్రా ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.రాజకీయాల్లో ప్రియాంకకు ఉజ్వల భవిష్యత్ ఉందని, ఈ దేశంలో క్షేత్రస్థాయిలో అవసరమైన మార్పులు తీసుకురాగలదని తాను భావిస్తున్నట్లు రాబర్ట్ వాద్రా పేర్కొన్నారు. ప్రియాంక తన బామ్మ ఇందిరాగాంధీ, తండ్రి రాజీవ్ గాంధీ, సోనియా, సోదరుడు రాహుల్ గాంధీ నుంచి చాలా నేర్చుకుందని తాను భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలలో ఆమె గుర్తింపు పొందారు. ఆమె ఏం మాట్లాడినా గుండె లోతులనుంచి సూటిగా మాట్లాడుతుంది. ప్రజలు ఆమె మాటలను ఇష్టపడుతున్నారని వాద్రా అన్నారు

# నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలు


### రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా చలనం లేని సిఎం

### ఎక్స్ వేదికగా మండిపడ్డ కెటిఆర్



హైదరాబాద్,డిసెంబర్24(ఆర్ఎన్ఎ): 2028లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కోస్గి సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. నీటి ద్రోహంపై జవాబు చెప్పలేక నికృష్టపు మాటలు మాట్లాడుతున్నారని 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. 'జల హక్కులను కాపాడటం రేవంత్‌రెడ్డికి చేతకాదు. పాలమూరు ప్రాజెక్టు గొంతుకోసి.. సొంత జిల్లానే దగా చేస్తున్నారు. తెలంగాణ సోయిలేని.. రాష్ట్ర ప్రయోజనాలు రక్షించలేని వ్యక్తి రేవంత్‌రెడ్డి. శాసన సభలో.. జనసభలో ప్రతిచోటా కాంగ్రెస్ జలద్రోహాన్ని ఎండగడతాం. జనం అన్నీ గమనిస్తున్నారు.. సందర్భం వచ్చినప్పుడు తొక్కి నారతీస్తారు' అని కేటీఆర్ అన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 750 మందికి పైగా రైతులు మరణించినా సీఎం రేవంత్ రెడ్డికి కనీసం చీమ కుట్టినట్టు కూడా లేదని కేటీఆర్ విమర్శించారు. పంట కొనే దిక్కులేక కొనుగోలు కేంద్రం వద్దే జమ్మన్న అనే రైతు గుండెపోటుతో కుప్పకూలి మరణించడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని కలుకుంట్ల మొక్కజొన్న కేంద్రం వద్ద జరిగిన ఈ ఘటనకు పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే అని చెప్పారు. నాలుగు రోజులుగా పడిగాపులు పడుతున్నా కూడా మొక్కజొన్న పంట కొనకుండా కాంగ్రెస్ సర్కారు అన్నదాత నిండు ప్రాణాన్ని బలితీసుకుందన్నారు. ఓ వైపు పెట్టుబడి సాయం అందక అప్పుల పాలై రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, మరోవైపు భారీ వర్షాలతో పంట నష్టపోయినా కూడా కనీసం పరిహారం అందక కౌలు రైతులు సైతం బలవన్మరణాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఇంకోవైపు పనికిరాని యాప్‌లతో యూరియా అందక అన్నదాతలు మళ్లీ ఈ సీజన్‌లోనూ అష్టకష్టాలు పడుతున్నారన్నారు. దేళ్లపాటు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యంగా మార్చి.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా సంక్షోభంలోకి నెట్టిన ఈ పాపం ఊరికే పోదని చెప్పారు. కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్న రైతుల కష్టాలు తీర్చేందుకు ఇప్పటికైనా రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర వీడాలని అన్నారు. ముఖ్యమంత్రి నిర్వాకంతో ఇవాళ గుండె పగిలి మరణించిన జమ్మన్న కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందిచాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను అకస్మాత్తుగా తనిఖీ చేసిన మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



హైదరాబాద్: రెడ్డిపల్లి సబ్ స్టేషన్ ను మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అకస్మాత్తుగా తనిఖీ చేసారు.. హరీష్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు కేవలం 12 గంటల కరెంటు మాత్రమే సరఫరా చేస్తున్నట్టుగా ఉంది నర్సాపూర్ సబ్ స్టేషన్ లో,సునీత లక్ష్మారెడ్డి నేను కలిసి సబ్ స్టేషన్ ను విజిట్ చేయడం జరిగింది. పార్టీ సమావేశానికి వెళు తుండగా రైతులు కరెంట్ రావడంలేదని ఫోన్ చేస్తే సడన్గా ఆగడం జరిగింది. రెండు గ్రామాల రైతులు రెడ్డిపల్లి, మద్దూరు గ్రామ రైతులు ఫోన్ చేసి మాకు కరెంటు సరిగ్గా రావడంలేదని ఫోన్ చేస్తే మేము ఇక్కడికి సబ్ స్టేషన్ దగ్గర ఆగడం జరిగింది. రేవంత్ రెడ్డి 24 గంటలు కరెంటు ఇస్తమంటున్నాడు రెడ్డిపల్లి మద్దూరు గ్రామాల ప్రజలు 12-13 గంటలకు కరెంటు మాత్రమే వస్తుంది. మాకు ఇబ్బంది అవుతుంది నారుబోసే సమయము పొలానికి నారేసే టైం ఇబ్బంది అవుతుందని.. ఫోన్ చేస్తే ఇది నిజమా కాదా అని సమస్య ఏంది అని తెలుసుకుందామని నర్సాపూర్ సబ్ స్టేషన్ కు రావడం జరిగింది. ఇక్కడ లాక్ బుక్ చూస్తే కేవలం 12 గంటల కరెంటు మాత్రమే వచ్చింది. ఇంకొక రోజు చూస్తే సాయంత్రం ఐదు గంటలకు పోయి ఉదయం 3:00 వచ్చింది. అంటే 14 గంటలు మాత్రమే వచ్చింది ఇంకొక రోజు చూస్తే 13 గంటల కరెంట్ వచ్చింది అంటే ఈ విధంగా 12,13 గంటల కరెంటు మాత్రమే వస్తుంది. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు కరెంటుకు మేమే చాంపియన్, 24 గంటల కరెంటుకు మేమే బ్రాండ్ అంబాసిడర్ అని చెప్పిండు. మరి 12 గంటల కరెంట్ ఎందుకు వస్తుంది నాయనా రేవంత్ రెడ్డి. ఆనాటి కాంగ్రెస్ పాలనలో కరెంటుతో రైతులు ఇబ్బందులు పడ్డారు నేడు కాంగ్రెస్ పాలనలో రైతులు కరెంటుతో ఇబ్బందులు పడుతున్నారు. నాడు ఎరువులకు ఇబ్బందులు పడ్డారు నేటి కాంగ్రెస్ పాలనలో ఎరువులకు ఇబ్బందులు పడుతున్నారు. మేం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తా ఉన్నాం రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలి భట్టి విక్రమార్క మీరు పెద్దపెద్ద మాటలు మాట్లాడడం కాదు, కెసిఆర్ అంటేనే 24 గంటల కరెంటు కు బ్రాండ్ అంబాసిడర్: ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రైతుల కోసం 24 గంటలు నాణ్యమైన కరెంటు ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.కానీ మీరు వచ్చిన తర్వాత 12 13 గంటల కరెంటు కూడా రైతులకు రావడం లేదు,ఏది చూసినా సగం సగమే ఉంది రేవంత్ ప్రభుత్వంలో24 గంటల కరెంటు రైతు బంధు, రుణమాఫీ బోనస్ అన్నిట్లో సగం సగం, దమ్ముంటే అసెంబ్లీలో విద్యుత్ సరఫరా మీద చర్చ పెట్టండి ప్రతిపక్షాల మీద బురద జల్లడం కాదు, రైతు సమస్యల మీద ప్రజల సమస్యల మీద చర్చ పెట్టండి రైతులకు ఇచ్చిన హామీలు ఎగ్గొటినందుకు భయపడి కారు గుర్తు కనపడే ఎన్నికలు పెడుతలేదు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే కో ఆపరేటివ్ ఎన్నికలు పెట్టు ఈ ప్రభుత్వమే రైతు వ్యతిరేక ప్రభుత్వం. మేం ఒచ్చి చూసినం అని ఈ అధికారుల మీద చర్యలు తీసుకోకూ రేవంత్ రెడ్డి. నీకు నిజాయితీ ఉంటే రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

# మీ సహాయం అక్కర్లేదు

### చాలా దాటుకుని వచ్చాను

### శివాజీ కామెంట్స్‌పై అనసూయ కామెంట్స్



హైదరాబాద్,డిసెంబర్24:హీరోయిన్‌ల దుస్తులపై శివాజీ వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపింది. దీనిపై సామాజిక మాధ్యమాల వేదికగా కామెంట్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో బుధవారం శివాజీ ప్రెస్‌మీట్ పెట్టి, తన వ్యాఖ్యలకు వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తూ, తాను నటి అనసూయను ఏమీ అనలేదని ఆమె అనవసరంగా ఇందులోకి వచ్చారని అన్నారు. దీనిపై అనసూయ స్పందించారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో వీడియోను పంచుకున్నారు. 'త్వరలోనే మీ రుణం తీర్చుకునే అవకాశం నాకు కూడా రావాలని కోరుకుంటున్నా' అని తనని ఉద్దేశిస్తూ నటుడు శివాజీ చేసిన తాజా వ్యాఖ్యలపై నటి అనసూయ ఘాటుగా స్పందించారు. చాలా సందర్భాల్లో చాలా దాటుకుని వచ్చాను. మీ సపోర్ట్ నాకు అక్కర్లేదు. నన్ను నేను ఎలా రక్షించుకోవాలో నాకు తెలుసని అన్నారు. ఇటీవల నేను ఓ వస్త్ర దుకాణం ఓపెనింగ్‌కు వెళ్లాను. అక్కడ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చాను. ఆయనకు అనిపించింది చెప్పినప్పుడు నాకు అనిపించింది నేను చెప్పా. ఈరోజు ఒక్కరే కూర్చొని. బాధితుడిగా నటిస్తున్నారు. ఆయన వ్యవహారశైలి 'నార్సిసిస్ట్'లా ఉంది. దీన్నే అతి తెలివి అంటారు. ఒక్క మాటలతో చెప్పాలంటే, చేతగానితనంతో మాట్లాడుతున్నారు. అదేమంటే ఫేక్ ఫెమినిస్ట్‌లని మాపై ముద్రవేస్తారు. అసలు ఫెమినిజం అనేది లేదు. ఇక్కడ అందరికీ సమాన హక్కులు ఉండాలి. స్త్రీ, పురుషులు ఉంటేనే ప్రకృతి ముందుకు వెళ్తుంది. ఈ కాలంలో కూడా దుస్తుల గురించి మాట్లాడటం చేతగానితనం. స్వీయ నియంత్రణ లేని వాళ్లు, అభద్రతాభావంతో బతికే వాళ్లు మాత్రమే ఎదుటి వాళ్లపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తారు. ఈ రోజు సానుభూతి పోగు చేసుకుని ఒక్కరే మీడియా ముందు కూర్చొన్నారు. పాపం ఆయనకు అదే కావాలి. నేను కూడా హీరోయిన్‌నే. ఒకట్రెండు సినిమాల్లో లీడ్ రోల్‌చేశా. హీరోయిన్లు మంచిగా దుస్తులు వేసుకోవాలని ఆయన చెబుతున్నారు. మీరు ఏం వేసుకోవాలో నేను చెబుతున్నానా? మేము చిన్నపిల్లలం కాదు. మా హక్కులు మాకు తెలుసు. మా ఇష్టానికి మమ్మల్ని బతకనీయండి. నా పేరు ఎత్తలేదు కానీ, అందరినీ ఉద్దేశించి అన్నారు కదా! చాలా మంది హీరోయిన్స్ లాగే నేనూ గ్లామర్‌గా ఉండాలనుకుంటున్నా అని అన్నారు. నన్ను బాగా చూసుకునే భర్త, స్నేహితులు ఉన్నారు. మీలాంటి వాళ్ల సాయం అస్సలు అక్కర్లేదు. ఇప్పుడు నాపై కామెంట్‌లు చేసిన వారితో పాటు ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన పెద్ద మనిషికి కూడా చట్టపరంగా నోటీసులు వస్తాయి' అని అన్నారు. మరోవైపు నటి నిధి అగర్వాల్ కూడా ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. 'బాధితులపై తప్పు నెట్టడాన్నే అతి తెలివి అంటారు' అంటూ పోస్ట్ పెట్టారు.

### ఢిల్లీలో మూడు రోజులు ఉంటే..

## అలర్జీలు వచ్చాయి

### ఢిల్లీలో నేను ఉండలేను..నితిన్ గడ్కరీ

**మెవ్ ఢిల్లీ డిసెంబర్ 24 :** దేశంలో అత్యంత కాలుష్య నగరాల్లో దేశరాజధాని ఢిల్లీ మొదటి స్థానంలో ఉంటుంది. అక్కడ ఏటా శీతాకాలం సమయంలో కాలుష్య స్థాయిలు ప్రమాదకరస్థాయిలో ఉంటాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. తాను మూడు రోజులు ఢిల్లీలో ఉంటే.. కాలుష్యం కారణంగా అలర్జీలు వచ్చాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఢిల్లీలో తీవ్ర కాలుష్యానికి 40 శాతం రవాణా రంగమే కారణమని అంగీకరించారు. 'నేను రవాణా శాఖ మంత్రిని. 40 శాతం కాలుష్యానికి రవాణా రంగమే కారణం' అని తెలిపారు.'ఇది ఎలాంటి జాతీయవాదం..? శిలాజ ఇంధనాలు పరిమితంగా ఉన్నాయి. కాలుష్యం పెరుగుతోంది. శిలాజ ఇంధన వినియోగాన్ని మనం తగ్గించలేమా..? సున్నా కాలుష్యానికి దారితీసే ఎలక్ట్రిక్ వాహనాలు, హైడ్రోజన్ శక్తితో నడిచే వాహనాలను మనం ఎందుకు ప్రోత్సహించలేము..?' అని నితిన్ గడ్కరీ ప్రశ్నించారు. శిలాజ ఇంధనాల్ని దిగుమతి చేసుకోవడానికి ఏటా రూ.22 లక్షల కోట్ల ఖర్చు అవుతోందని.. ఇది ఆర్థిక భారమని చెప్పారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎలక్ట్రిక్, హైడ్రోజన్ వాహనాల వైపు మళ్లాలని సూచించారు.

**ఢిల్లీలో నేను ఉండలేను..**

కాగా, ఢిల్లీ కాలుష్యంపై గడ్కరీ గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యలే చేసిన విషయం తెలిసిందే. తాను రాజధాని నగరంలో రెండు లేదా మూడు రోజులకంటే ఎక్కువ ఉండలేనని అన్నారు. ఢిల్లీకి వస్తే.. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుందని వ్యాఖ్యానించారు. 'నేను ఢిల్లీలో రెండు లేదా మూడు రోజులు మాత్రమే ఉండగలను. అంతకుమించి ఉండటం నావల్ల కాదు. ఢిల్లీలో అడుగుపెట్టగానే ఎప్పుడు వెళ్లిపోదామా అనే ఉంటుంది.



# మరో హిందీ మూవీలో తమన్నా

తెలుగు, తమిళం, హిందీతోపాటు పాన్ ఇండియా స్థాయిలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న భామల్లో టాప్‌లో ఉంటుంది తమన్నా భాటియా. ఈ ఏడాది తెలుగులో ఓదెల 2 చిత్రంలో లీడ్ రోల్‌లో నటించిన తమన్నా.. హిందీ రైడ్ 2లో కామియో రోల్‌లో మెరిసింది. తాజాగా మరో హిందీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది తమన్నా. షాహిద్ కపూర్ నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఓ రోమియో చిత్రంలో వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీలో తృప్తి డిమ్రి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. విక్రాంత్ మస్సే, దిశా పటాని, నానా పటేకర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. విశాల్ భరద్వాజ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీని సాజిద్ నడియాడ్‌వాలా నిర్మిస్తున్నారు. బిగ్ బ్జడెట్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రం హిందీ నుంచి రాబోతున్న మోస్ట్ ఎవెయిటెడ్ ప్రాజెక్టుల్లో ఒకటి కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఓ రోమియో షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ భామ ఖాతాలో ఇప్పటికే నాలుగు హిందీ సినిమాలుండగా.. షూటింగ్ దశలో ఉన్నాయి. మొత్తానికి బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది మిల్కీ బ్యూటీ.

# రష్మిక ది గర్ల్‌ఫ్రెండ్.. మరో క్రేజీ రికార్డ్..!



రష్మిక ప్రధాన పాత్రలో వచ్చిన లేటేస్ట్ మూవీ ది గర్ల్‌ఫ్రెండ్. గత నెలలో థియేటర్లలో రిలీజైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ నిలిచింది. దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో నటించిన ఈ మూవీకి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించారు. విడుదలైన ఐదు రోజుల్లోనే రూ.20 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఓవరాల్‌గా రూ.28 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. అయితే కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్లింది. ప్రస్తుతం ఈ సూపర్ హిట్ మూవీ ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. తాజాగా ఈ సినిమా అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచంలోనే ఓటీటీలో అత్యధికంగా వీక్షించిన నాన్-ఇంగ్లీష్ చిత్రాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ సింగర్ చిన్మయి శ్రీపాద ట్వీట్ చేసింది. ది గర్ల్‌ఫ్రెండ్ పోస్టర్‌ను షేర్ చేసింది. కాగా.. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మించారు.

**ది గర్ల్‌ఫ్రెండ్ కథేంటంటే?**

భూమా (రష్మిక మందన్నా) తండ్రి (రావు రమేశ్)చాటు కూతురు. పీజీ చదివేందుకు తొలిసారి తండ్రిని వదిలి నగరానికి వెళ్లి ఓ కాలేజీలో చేరుతుంది. అదే కాలేజీలో విక్రమ్ (దీక్షిత్ శెట్టి), దుర్గ (అను ఇమ్మాన్యుయేల్) కూడా చేరతారు. దుర్గ.. విక్రమ్‌ను ప్రేమిస్తే.. అతడు మాత్రం భూమాను లవ్ చేస్తాడు. ప్రేమ జోలికి వెళ్లకూడదనుకుంటూనే భూమా కూడా అతడితో ప్రేమలో పడిపోతుంది. తర్వాత ఏం జరిగింది? భూమా జీవితం విక్రమ్ కంట్రోల్‌లోకి వెళ్లిందని తెలుసుకుని ఆమె ఏం చేసింది? అన్నదే మిగతా కథ.

# సెట్స్‌కు వస్తా

**రాజమౌళితో హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్**

'వారణాసి' మూవీ సెట్‌కు వచ్చి షూటింగ్ చూడవచ్చా? అని హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు జేమ్స్ కామెరూన్ మన తెలుగు దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళిని కోరారు. కామెరూన్ దర్శకత్వంలో రూపొందిన విజువల్ వండర్ 'అవతార్'. ఇప్పటికే రెండు భాగాలు వచ్చిన ఈ మూవీ ఇప్పుడు ముచ్చటగా మూడో భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'డిసెంబరు 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా 'అవతార్' టీమ్ భారత్‌లో వినూత్నంగా ప్రచారానికి తెర తీసింది. దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి సహా కొంత మంది సినీ ప్రముఖులకు 'అవతార్ 3'ని చూపించారు. అనంతరం జేమ్స్ కామెరూన్, రాజమౌళి వీడియో కాల్ ద్వారా మాట్లాడుకున్నారు. సినిమా మేకింగ్, పాత్రల తీరు తెన్నుల గురించి ఒకరితోనొకరు చర్చించుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. ఈ సందర్భంగా 'వారణాసి' మూవీ ప్రస్తుత పరిస్థితి గురించి రాజమౌళిని కామెరూన్ అడిగి తెలుసుకున్నారు. ఏడాదిగా షూటింగ్ జరుగుతోందని, మరో ఏడెనిమిది నెలల పాటు షూటింగ్ ఉందని రాజమౌళి వివరించారు. 'వారణాసి' షూటింగ్, సెట్స్ చూడాలని ఉందన్న కామెరూన్.. 'వచ్చి చూడవచ్చా' అని అడిగారు. ఈ మాటతో రాజమౌళి తెగ సంబరపడిపోయారు. 'మీరు రావడం ఎంతో సంతోషకరమైన విషయం. మా 'వారణాసి' టీమ్ మాత్రమే కాదు. మొత్తం సినిమా ఇండస్ట్రీ థ్రిల్ అవుతుంది' అని రాజమౌళి అనగా, 'పులులతో ఏదైనా షూట్ ప్లాన్ చేస్తుంటే చెప్పు' అని కామెరూన్ సరదాగా అనడంతో నవ్వులు వెల్లివిరిశాయి. సెకండ్ యూనిట్‌కైనా కెమెరా పట్టుకుని తాను కొన్ని సీన్స్ తీస్తానని కామెరూన్ చెప్పడం గమనార్హం. ఈ సందర్భంగా ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ.. 'అందరి కంటే ముందు 'అవతార్: ఫైర్ అండ్ యాష్' చూడటం నిజంగా ఎంతో సంతోషంగా ఉంది. మూవీలో సీక్వెన్స్, విజువల్స్, పాత్రలు తీర్చిదిద్దిన విధానానికి హ్యాట్సాఫ్. మూవీ చూస్తున్నప్పుడు థియేటర్‌లో చిన్న పిల్లాడిలా అయిపోయాను. బయటకు వచ్చాక కూడా అవే ఆలోచనలు వెంటాడాయి.






# చతికిలపడుతున్న తమిళ సీనియర్ హీరోలు.. సిమ్రాన్ కామెంట్ నిజమే

సినిమా అనే ప్రపంచంలో ఎప్పుడూ రేసు కొనసాగుతూనే ఉంటుంది. ఇక్కడ ఎవరు ఎలాంటి కథలతో చిత్రాలు చేసినా అంతిమ లక్ష్యం విజయం సాధించడమే. తద్వారా ఆర్థికపరమైన లాభాలు ప్రధానాంశంగా మారతాయి. సినిమా శతాబ్ది వేడుకను జరుపుకున్నా ఇప్పటికీ ఈ ఫార్ములాలో ఎలాంటి మార్పులేదు. ఉండదు కూడా. వైవిధ్యం అనేది దర్శకుడి సృజనాత్మకతపైనే ఆధారపడి ఉంటుంది. అదేవిధంగా ఇప్పుడు ప్రేక్షకులు మోనాటమిని అసలు ఇష్టపడడం లేదు. అది ఏ సూపర్‌స్టార్ హీరోగా నటించినా నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టేస్తున్నారు. ప్రస్తుతం కోలీవుడ్ సీనియర్ హీరోల సినిమాలకు గడ్డుకాలం ఏర్పడింది. ఇందుకు చిన్న ఉదాహరణ ఇటీవల రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన వేట్టయన్, కూలీ మూవీతో పాటు కమలహాసన్ నటించిన థగ్ లైఫ్, విజయ్ నటించిన లియో, గోట్, అజిత్ నటించిన విడాముయర్చి , సూర్య నటించిన రెట్రో, కంగువ వంటి చిత్రాలే. అదేవిధంగా జయాపజయాలు ఎవరి చేతిలోనూ ఉండవన్నది జగమెరిగిన సత్యం. సినిమా, జయాపజయాలు అన్నవి నిరంతర ప్రక్రియ.



# కథలు రాస్తున్నాను: ఫరియా అబ్దుల్లా

నరేశ్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రం 'గుర్రంపాపిరెడ్డి'. మురలీ మనోహర్ దర్శకత్వంలో డా. సంధ్య గోలీ సమర్పణలో వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ%-%"ఈ సినిమాలో నేను సౌధామిని అనే నర్సుపాత్ర చేశాను. డాక్టర్ కావాలనుకుంటున్న సౌదామిని జీవితంలోకి గుర్రంపాపిరెడ్డి (నరేశ్ అగస్త్య రోల్) వచ్చి, ఆమె జీవితాన్నే మార్చేస్తాడు. దీంతో 'గుర్రంపాపిరెడ్డి' గ్యాంగ్‌తో కలిసి సౌదామిని ఓ దొంగతనంలోపాల్గొనాల్సి వస్తుంది. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది? సినిమాలో చూడాలి. ఈ చిత్రంలో నేను డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తాను. ఈ చిత్రం కోసం ఓ ప్రమోషనల్ సాంగ్ చేశాను. ఈపాటకు నేనే కొరియోగ్రఫీ చేశాను. యాక్షన్ సైకో కిల్లర్, సీరియల్ కిల్లర్ తరహా రోల్స్ చేయాలని ఉంది. 'భగవంతుడు' సినిమాలో విలేజ్ గాళ్‌గా చేస్తున్నాను. 'మత్తు వదలరా 3' ఉంది. సందీప్ కిషన్ మూవీలో ఓ రోల్ చేస్తున్నాను. 'గాయపడ్డ సింహం' చిత్రంలో కీ రోల్ చేస్తున్నాను. నాకు దర్శకత్వం వహించాలని ఉంది. కొన్ని కథలు రాస్తున్నాను" అన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.